ఉప్పల్ భగాయత్‌కు ప్రత్యేక శానిటేషన్ టీమ్

ఉప్పల్: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు శానిటేషన్ అధికారి చందన అన్నారు. ఇందులో బాగంగా ఉప్పల్ బగాయత్‌కు ప్రత్యేకంగా 21 మంది శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇన్నాళ్లు భగాయత్‌లో రోడ్లు పరిశుభ్రంగా ఉండేవి కావన్నారు. ఇక నుంచి 21 మంది పారిశుద్ధ్య సిబ్బందితో పాటు సూపర్వైజర్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో స్థానికులు సుధాకర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, రామచంద్రరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి

మల్లాపూర్: బాలల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. గురువారం అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై కూడా ఉందన్నారు. బాలలకు జీవించే హక్కు, విద్యాహక్కు, అభివృద్ధి చెందే హక్కులు ఉన్నాయన్నారు. సామాజిక పరిస్థితులపై మాతృమూర్తులు అవగాహన పెంపొందించుకుని బిడ్డలను సరైన రీతిలో పెంచినప్పుడే శక్తివంతులైన పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సత్యప్రసాద్, గిరిబాబు, ప్రీతం, సంజు, వికాస్‌రెడ్డి, అఫ్రోజ్, షోయబ్, సమీర్, మోనిస్, అఖిల్, సత్యం, ఇర్ఫాన్, సల్మాన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

మల్లాపూర్: సెలవుల అనంతరం స్కూల్స్ ప్రారంభం కావడంతో మల్లాపూర్‌లోని ప్రభుత్వ స్కూల్‌ను స్కేట్ డైరెక్టర్ రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మండల విద్యాధికారి రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా శీతల విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ నియమాకపత్రాన్ని గురువారం డివిజన్ పార్టీ అధ్యక్షురాలు గూడూరు శైలజారెడ్డి అందించారు. డివిజన్‌లో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీకాంత్‌రెడ్డి, అంజనేయులు, రవీందర్, సాగర్, ముత్యంరెడ్డి, మాధవి, కిరణ్‌కుమార్ రెడ్డి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో గాయత్రి హోమం

కుషాయిగూడ: నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవాన్ని గురువారం కుషాయిగూడలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గాయత్రి హోమం నిర్వహించారు. పాండాల శివకుమార్‌గౌడ్, అపర్ణ, మల్లికార్జున్‌రెడ్డి, శశికళ దంపతులు ఈ హోమంలో పాల్గొని గణపతి, సరస్వతీ పూజలనంతరం గాయత్రి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులకు సరస్వతి మాత ఆశీర్వచనం అందజేసి బోధన తరగతులు మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు సత్యనారాయణ, విజయ్‌కుమార్, వినోద్, లక్ష్మీ, ఉమారాణి, మూర్తి, విజయలక్ష్మీ, ప్రభాకర్‌తో పాటుగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు నడుం బిగిద్దాం

బోడుప్పల్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు నడుం బిగిద్దామని బోడుప్పల్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్ 17వ డివిజన్‌లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు కృషి చేయాలన్నారు. డెంగీ మహమ్మారిని తరిమి కొట్టేందుకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, వార్డు ఆఫీసర్ కిరణ్‌రెడ్డి, బాలనర్సింహ పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

రామంతాపూర్: భగాయత్ వెంకట సాయినగర్ కాలనీ, ఇతర కాలనీల ప్రజలు స్థానికంగా ఉన్న దేవాలయానికి వెళ్లడానికి దారి లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక సంక్షేమ సంఘం నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జోనల్ కమిషనర్ హేమంత్‌కుమార్‌తో మాట్లాడి బాక్స్ కల్వర్టు నిర్మాణానికి రూ.34.5 లక్షలు మంజూరు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాజకీయాలకు తావు లేకుండా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానన్నారు. చాలా సంవత్సరాలుగా దారి లేక ఇబ్బంది పడుతున్న పలు కాలనీల ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విచారణకు ఆదేశం

చర్లపల్లి ఐలాలో నిధుల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశించిన టీజీఐఐసీ

- కమిషనర్‌తో సమావేశమైన ఎంసీ కమిటీ ప్రతినిధులు
- పొంతన లేని సమాధానాలు చెబుతున్న కమిషనర్
- ఐలా అధికారుల సమన్వయ లోపమే దీనికి కారణం: ఐలా చైర్మన్

సాక్షి ఎఫెక్ట్..

కుషాయిగూడ: 'చర్లపల్లి ఐలాలో నిధుల గోల్‌మాల్'అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి టీజీఐఐసీ స్పందించి విచారణకు ఆదేశించింది. ప్రస్తుత పాలక కమిటీ మూడేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇతర వ్యవహారాలపై లోతుగా విచారించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. దీంతో చర్లపల్లి ఐలా మేనేజింగ్ కమిటీ గురువారం అత్యవసరంగా సమావేశమయ్యింది. జరిగిన అవకతవకలపై సమావేశంలో సుదీర్ఘంగంగా సమీక్షించినట్లు సమాచారం. రివైజ్ చేసిన ప్రతిపాదనలకు సంబంధించిన ఎస్టిమేషన్ పత్రాలను సమర్పించాలని ఐలా చైర్మన్ రోషిరెడ్డి కమిషనర్‌ను కోరినట్లు తెలిసింది. తమకు సంబంధించిన టెక్నికల్ టీమ్‌తో పాటుగా ప్రైవేటు సివిల్ ఇంజినీర్లతో కలిసి రివైజ్ ఎస్టిమేషన్‌ను పరిశీలించే వరకు ఎలాంటి చెల్లింపులు చేయవద్దంటూ తీర్మానించినట్లు చెప్పారు.

ఎంసీ వ్యతిరేకించినప్పటికీ నిధులు బదిలీ చేశారు.!

సంపు నిర్మాణ పనుల అంచనాలను పెంపును ఎంసీ కమిటీ ప్రతినిధులు ఓ వైపు వ్యతిరేకిస్తూ తీర్మానం చేశామని చెబుతున్నప్పటికీ కమిషనర్ అంచనాలు రివైజ్ చేసిన నిధులను హెడ్ ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిసింది. దీనిపై కమిషనర్ పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారు. ఇన్‌ప్రాసెస్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ చేశామని కానీ కాంట్రాక్టర్‌కు చెల్లింపులు జరగలేదని ఓసారి.. అసలు ఫండే ట్రాన్స్‌ఫర్ చేయలేదని మరోసారి చెప్పడం అందుకు కావాల్సిన ఆధారాలు కూడా చూపుతాననడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఐలా అధికారుల సమన్వయ లోపంతోనే: ఐలా చైర్మన్ రోషిరెడ్డి

ఐలా అధికారుల సమన్వయ లోపం వల్లే ఇదంతా జరిగిందని ఐలా చైర్మన్ రోషిరెడ్డి అంటున్నారు. మొదట నార్త్‌ఈస్ట్ కార్నర్‌లో నిర్మాణం చేద్దామనుకున్న సంపు కొన్ని కారణాల వల్ల వెస్ట్ సౌత్ కార్నర్‌లో నిర్మాణం చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో సాయిల్ కండీషన్‌ను బట్టి హెచ్ఎండబ్ల్యూఎస్ పైప్‌లైన్ మ్యాచ్ చేసే క్రమంలో సంపులోతు పెరిగిన మాట వాస్తవమన్నారు. 3 లక్షల లీటర్ల సంపు సామార్థ్యం కాస్తా 5.66 లక్షలకు పెరిగిందన్నారు.

◆ ఇందుకు సంబంధించిన ఎస్టిమేషన్ మేనేజింగ్ కమిటీ ముందు ఉంచకుండానే రివైజ్ చేసిన నిధులను ట్రాన్స్‌ఫర్ చేయాలని ఐలా అధికారులు ఎంసీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారని అన్నారు. దీనిని ఎంసీ పూర్తిగా వ్యతిరేకించి నిధుల విడుదలను నిలిపి వేయాలంటూ సమావేశంలో తీర్మానం చేశామన్నారు. బుధవారం సాక్షిలో వచ్చిన కథనంతో ఎంసీ గురువారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి సమీక్షించినట్లు తెలిపారు. నిధుల రివైజ్‌పై ఐలా టెక్నికల్ టీంను ప్రశ్నించి అందుకు సంబంధించిన ఎస్టిమేషన్ పత్రాలను అందజేయాలని కమిషనర్‌ను కోరినట్లు చెప్పారు.

◆ ఉస్మానియా యూనివర్సిటీ టెక్నికల్ టీం అందజేసిన ఎస్టిమేషన్ పత్రాలను ఏఈ భరత్‌రెడ్డి ఎంసీ సభ్యులకు అందజేశారన్నారు. ఈ ఎస్టిమేషన్‌పై టెక్నికల్ టీంతో పాటుగా సివిల్ ఇంజినీర్లతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఇక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అందజేస్తున్న విరాళాలకు ప్రతి పైసాకు లెక్కలు ఉన్నాయన్నారు. దీని నిర్వహణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు.

సాక్షి కథనంపై వివరణ ఇచ్చిన కమిషనర్..

సాక్షిలో ప్రచురించిన ఐలా నిధుల గోల్‌మాల్ కథనంపై కమిషనర్ ప్రభాకర్ స్పందించారు. ఎంసీ మీటింగ్ అనంతరం ఆయన సాక్షితో మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ. లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో టెక్నికల్ టీం అందజేసిన ప్రతిపాదనల ఆధారంగా పనులను రివైజ్ చేసి ఎస్టిమేషన్ తయారు చేశామన్నారు. భూ ఉపరితలం, సాయిల్‌ను బట్టి డిజైన్ మార్పు చేశామంటూ వివరణ ఇచ్చారు. మొన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకంటూ వివరణ ఇచ్చిన కమిషనర్ గురువారం ఓయూ టెక్నికల్ టీమ్ అంటూ వివరణ ఇవ్వడం ఆశ్చర్యానికి గురిచేసింది.

దేవాదాయ భూముల జోలికొస్తే కఠిన చర్యలు

చెంగిచర్లలో కబ్జాకు గురైన 30 ఎకరాల భూమిని పరిశీలించిన మంత్రి సురేఖ


వివరాలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి సురేఖ

బోడుప్పల్: దేవాదాయ భూములను కబ్జా చేసి లేఅవుట్‌లు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. చెంగిచర్లలోని సర్వే నంబరు 33/8, 33/9, 33/10లో 30 ఎకరాల ఎండోమెంట్ భూమి కబ్జా అయిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఫిర్యాదు చేయగా, మంత్రి గురువారం ఆకస్మాత్తుగా ఆ ప్రాంతాన్ని సందర్శించారు. కబ్జా గురైన భూముల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెంగిచర్లలోని సర్వే నంబరు 33/8లో 10.35 ఎకరాలు, 33/9లో 13 ఎకరాలు, 33/10లో 6.23 ఎకరాల ఎండోమెంట్ భూమి ఉందన్నారు. సదరు భూమి పక్కన ఉన్న భూ యజమానులు నోమా యాదగిరిరెడ్డి, హర్ష అనే వ్యక్తులు ఈ దేవాదాయ భూమిని ఆక్రమించుకుని విల్లాలు కడుతున్నారని వజ్రేష్ యాదవ్ అధికారులకు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. ఆ భూముల్లో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కబ్జా చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నేత కొత్త ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం జలమండలి జీఎం సునీల్‌కుమార్, డీజీఎం అశ్రితతో కలిసి కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు లోప్రెషర్‌తో సమయపాలన లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నారని కార్పొరేటర్‌కు తెలిపారు. కొత్త కనెక్షన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా చాణుక్యపురి కార్యాలయంలో అధికారులు తగిన పత్రాలు లేవని మంజూరు చేయడం లేదని ఫిర్యాదు చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. చాణుక్యపురి సెక్షన్ అధికారులపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పనిచేయాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు నవీన్, తేజస్విని, సత్యనారాయణ, సంపత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ నామ్ రాజిరెడ్డి

రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఆలయ చైర్మన్ నామ్ రాజిరెడ్డి సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయానికి చెందిన భూముల లీజు వేలం ద్వారా వచ్చిన నిధులను ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని అన్నారు. కల్యాణ మండపంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన బహిరంగ వేలంలో విజేతలైన ప్రవీణ్, నాగరాజు యాదవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సురేందర్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు జంగయ్య, శోభ, సతీష్‌గౌడ్, లింగం, బాలయ్య, ప్రధానార్చకులు శేఖర్‌బాబు శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడిగానే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం


మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: పేద, మధ్య తరగతి వారికి ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఉమ్మడిగా చేవడుతున్నామని ఇందుకు సంసిద్ధత వ్యక్తం చేయాలని కార్పొరేటర్ చింత శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజీవ్ వీకర్‌సెక్షన్ కాలనీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించారు. స్థల సమస్యతో 400 గజాలకు పైగా స్థలం ఒకే చోట సమకూర్చి వారికి మూడు అంతస్తుల భవన నిర్మాణాలు చేసి వారికి కేటాయించనున్నట్లు తెలిపారు. ముందుగా లబ్ధిదారులు సంసిద్ధత వ్యక్తం చేస్తే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు స్వామి, మధుమోహన్, సీవో సురేష్, కాంగ్రెస్ నాయకులు ఉదయ్‌కుమార్, జ్యోతి పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రత్యేక అధికారి సత్యనారాయణ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై స్వచ్ఛ పీర్జాదిగూడకు సహకరించాలని పీర్జాదిగూడ నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ అన్నారు. కమిషనర్ త్రిలేశ్వర్‌రావు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు తీరును ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం 16 స్వయం సహాయక సంఘాలకు రూ.2.4కోట్ల చెక్కును ప్రత్యేక అధికారి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు అధికారులను అభినందించారు. అనంతరం 6,12,22 వార్డులోని 45మంది వీధి వ్యాపారులకు స్ట్రీట్ వెండర్ స్టాల్స్ కేటాయింపు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఈఈ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్‌కుమార్, ఏఐ ప్రవీణ్‌కుమార్, ఈఈ బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన విరాల ప్రకారం... బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన సైదులు(40) బుధవారం రాత్రి 10.30గంటలకు నారపల్లి బవాచ్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని లారీ డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కళ్లెదుటే భర్త ఆత్మహత్యాయత్నం

భయంతో భార్య బలవన్మరణం


దీపిక (ఫైల్)

మేడిపల్లి: భార్యభర్తల మధ్య జరిగిన గొడవలు ఆత్మహత్యలకు ప్రేరేపించాయి. భార్యాభర్తల మధ్య జరిగిన గొడలతో భర్త బ్లేడ్‌తో ఆత్మహత్యయత్నాం చేయగా అది చూసిన భార్య ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... సంతోష్, దీపిక(20) రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. సంతోష్ మద్యానికి బానిస కావడంతో భార్య దీపిక బోడుప్పల్‌లోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది.

◆ ఈ క్రమంలో సంతోష్ బుధవారం దీపికను తీసుకెళ్లడానికి అక్కడకు వెళ్లాడు. అదేరోజు రాత్రి సుమారు 12గంటల సమయంలో వారి మధ్య వాగ్వాదం తీవ్ర స్థాయికి చేరుకుంది. సంతోష్ కోపంతో బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో భయాందోళనకు గురైన దీపిక ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. భార్య ఉరి వేసుకోవడం చూసినా సంతోష్ అపస్మారక స్థితిలోని వెళ్లాడు. ఈ విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడి అపస్మారకస్థితిలో ఉన్న సంతోష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రియల్ వ్యాపారం ముసుగులో డ్రగ్స్ దందా

ఉప్పల్: రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో ఉప్పల్‌కు చెందిన ఓ వ్యక్తి డ్రగ్స్ దందాను ప్రారంభించాడు. బెంగుళూరులోని ఓ వ్యక్తి నుంచి సేకరించి నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సీఐ సుభాష్‌చందర్ ఆధ్వర్యంలో ఆరుగురుల సిబ్బంది కలిసి గురువారం ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్‌లో మాటు వేసి ఉన్నారు. ఇంతలోనే ఓ బైక్ మీద మూతాతో అనుమానాస్పదంగా వ్యక్తి వెళ్లడాన్ని గమనించిన అధికారులు ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో 21.3 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ కనిపించింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయాన్ని బయట పెట్టారు. తాను వెంకట్ మోతీకుమార్ అని తను ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలో పని చేస్తున్నాని డబ్బులు సరిపోక ఇలా డ్రగ్స్ దందాను చేస్తున్నట్లు పోలీసుల సమక్షంలో నిందితుడు అంగీకరించాడు. తాను బెంగూళురుకు చెందిన ఓ వ్యక్తి నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి నగరంలోని అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు నిందితుడు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.1.50 లక్షల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

జూదరుల అరెస్టు

మేడిపల్లి: శ్రీరాం కుటీర్‌లోని ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా పేకాడుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు గురువారం రాత్రి ఆ ఇంటిపై దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న 9మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.38లక్షలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గాయత్రినగర్‌లో వర్షాకాల శానిటేషన్ షురూ


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్

మౌలాలి: డివిజన్‌లోని గాయత్రినగర్‌లో గురువారం ముందస్తు వర్షాకాల శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్‌యాదవ్ హాజరయ్యారు. కాలనీ అసోసియేషన్, కాలనీవాసుల భాగస్వామ్యంతో శానిటేషన్ ఎస్ఎఫ్ఏ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వీధులను శుభ్రం చేశారు. రాంకీ ఇన్‌చార్జ్ దయానంద్, కాలనీ ప్రెసిడెంట్ మహేష్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్, మాజీ అధ్యక్షులు లోహిత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి నాయకులు శివగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

షిరిడీనగర్‌లో ముంపు తలెత్తకుండా చూడండి


డీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకుడు నాగరాజు

మల్కాజిగిరి: షిరిడీనగర్‌లో ముంపు సమస్య తలెత్తకుండా చూడాలని బీజేపీ సీనియర్ నాయకుడు బక్క నాగరాజు డీసీ రాజుకు వినతిపత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ... షిరిడీనగర్‌లో నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభించారని రోడ్డు నిర్మాణ సమయంలో ఖచ్చితమైన లెవెలింగ్ పాటించేలా చూడాలన్నారు. దీని వలన వర్షం నీరు ఇండ్లలోకి రాకుండా ఉంటుందని సూచించామన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని సమస్య తలెత్తకుండా చూడాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, చంద్రకళ, సత్యనారాయణ, కృష్ణ చైతన్య, ఉమా కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హరిజన బస్తీ, కుమ్మర్ బస్తీలో రూ.9 లక్షల వ్యయంతో నిర్మించే సీసీరోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మచ్చబొల్లారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, దేవేందర్, కొండల్‌రెడ్డి, విష్ణు, వీవీఆర్. వెంకటేష్‌గౌడ్, రాము, సెల్వరాజు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అవినీతి మచ్చ లేకుండా సుపరిపాలన

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- మోదీ 11 ఏళ్ల పాలనపై ఎగ్జిబిషన్ ఏర్పాటు
- ఎల్లారెడ్డిగూడకు చేరుకున్న కార్యకర్తలు, స్థానికులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కాప్రా: ప్రధాని నరేంద్ర మోదీ 11ఏళ్లుగా ఏ ఒక్క చిన్న అవినీతి మచ్చ లేకుండా దేశ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ 11ఏళ్ల పాలనపై దేశ వ్యాప్తంగా బీజేపీ కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా మేడ్చల్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో గురువారం కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడలో మోదీ పాలనలో చేసిన అభివృద్ధి పథకాలు, సాధించిన ఆర్థిక ప్రగతి ఫలాలను ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అనిన వర్గాల ప్రజలకు పెద్దపీట వేస్తూ ప్రధాని మోదీ సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. పేద ప్రజలు, రైతులు, మహిళలు, యువతను దృష్టిలో పెట్టుకుని పాలన సాగిస్తున్నారని తెలిపారు.

◆ మోదీ సారథ్యంలో నేడు భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, డిజిటల్ లావాదేవీలతో పేదలకు అన్నీ చేరవేరుస్తున్నారని చెప్పారు. పన్ను విధానంలో సమగ్ర మార్పులు తీసుకొచారని, మోదీ పాలనలో పన్ను చెల్లించే వారి సంఖ్య కూడా పెరిగిందన్నారు. అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణకు కాస్త ఎక్కువ సహాయమే చేస్తుందని తెలిపారు.


మోదీ 11ఏళ్ల పాలనపై ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

◆ పహల్గాంలో పాక్ ఉగ్రదాడులకు ప్రతీకారం తీర్చుకుని, ఉగ్రవాదులపై బ్రహ్మాస్త్రం వదిలి భారత గౌరవాన్ని కాపాడారని కొనియాడారు. కోవిడ్ మహమ్మారితో యావత్ ప్రపంచం అతలాకుతలమైన ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిందన్నారు. ఆ కష్టకాలంలోనూ దేశంలోని రైతులను మోదీ ప్రభుత్వం ఆదుకుందని గుర్తుచేశారు. రైల్ల కనెక్టివిటీని పెంచి, రైల్వే స్టేషన్లను ఆధునీకరించడంతో పాటు వందేభారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. దేశంలో ఎయిర్‌పోర్టుల సంఖ్యను కూడా పెంచారని గుర్తు చేశారు.

◆ పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఆడబిడ్డల గౌరవం, రక్షణ కోసం ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రెసిడెంట్ ఎస్.మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ మర్రి మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రావణ్, నాయకులు శ్రీనివాస్, రమేష్‌యాదవ్, వినోద్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.